## నాణ్యమైన విద్య కోసం పార్టీలు కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న తల్లుల సంఘం, బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు

అడ్డగుట్ట, నవంబర్ 4 : మారేడుపల్లి మండలంలోని ఆజాద్ చంద్రశేఖర్ నగర్ పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం ఆధ్వర్యంలో శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోల్లో పిల్లల ఎజెండా, హక్కులను చేర్చాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక వసతులను కల్పనకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, మహేందర్, తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి, ఎంవీ ఫౌండేషన్ ఆర్గనైజర్లు సువర్ణ, భాగ్య, సుమలత తదితరులు పాల్గొన్నారు.

## నిమ్స్‌లో 'నోవిస్' ఇండక్షన్ కోర్సు ప్రారంభం



ఖైరతాబాద్, నవంబర్ 4 : నిమ్స్ అనస్థీషియా విభాగంలో అధునాతన వర్క్ స్టేషన్లు, కార్డియాక్ అవుట్ పుట్, న్యూరో.. రొటెమ్ ఫర్ కోగ్యులేషన్ మానిటరింగ్ వంటి పరికరాలతో సాంకేతిక పురోగతిని సాధించిందని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప పేర్కొన్నారు. శనివారం నిమ్స్‌లో అనస్థీషియా, ఇంటెన్సివ్ కేర్ విభాగంలో రెండు రోజుల 'నోవిస్' ఇండక్షన్ కోర్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు పద్మజ, గోపినాథ్, నిర్మల, నర్మద, డీన్ ప్రొఫెసర్ లిజా రాజశేఖర్, డాక్టర్ శివాని, డాక్టర్ అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.


## మహిళలు హక్కులను సాధించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తోట అపర్ణ

హిమాయత్‌నగర్, నవంబర్ 4: మహిళలు చైతన్యవంతులై హక్కులను సాధించుకోవాలని ప్రముఖ సామాజిక కార్యకర్త తోట అపర్ణ పిలుపునిచ్చారు. హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో శనివారం 'రాజకీయం, శాస్త్రీయ విద్య' అనే అంశంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. తోట అపర్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సమానత్వానికి విలువనిచ్చే మెరుగైన మానవజాతిని నిర్మించేందుకు మహిళలు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.జ్యోతి, కార్య నిర్వహక అధ్యక్షురాలు సదాలక్ష్మి, నాయకురాలు పశ్య పద్మ, ఎస్.ఛాయాదేవి, కరుణకుమారి, విజయలక్ష్మి, జంగమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

## వంగాల రజితకు డాక్టరేట్




వంగాల రజిత

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 4: ఉస్మానియా యూనివర్సిటీ చరిత్ర విభాగంలో వంగాల రజితకు డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ రామకృష్ణ పర్యవేక్షణలో 'ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు ది తెలంగాణ రీజియన్, ఫ్రమ్ 1956 టు 2014'అనే అంశంపై ఆమె పరిశోధన పూర్తి చేశారు. ఇటీవల జరిగిన ఓయూ స్నాతకోత్సవంలో రజిత డాక్టరేట్ స్వీకరించారు. యాదాద్రి జిల్లా వలిగొండ మండలం నాగారం గ్రామానికి చెందిన రజిత ప్రస్తుతం ఆర్కియాలజీ, మ్యూజియం శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కర్నూలు జిల్లా నంద్యాలలో పనిచేస్తున్నారు. రజితను పలువురు అభినందించారు.

# ప్రజాదరణతో హ్యాట్రిక్ విజయం తథ్యం

- బీఆర్ఎస్ సికింద్రాబాద్ అభ్యర్థి టీ. పద్మారావుగౌడ్
- చిలకలగూడలో నాయకులతో కలిసి ముమ్మర ప్రచారం



డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్‌ను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు



పద్మారావుగౌడ్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు

సికింద్రాబాద్, నవంబర్ 4: సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో అన్ని వర్గాల ప్రజల ఆదరణతో హ్యాట్రిక్ విజయం సాధిస్తానని డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పద్మారావు సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ హేమతో కలసి వివిధ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. చిలకలగూడలో నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రతి గడపకు వెళుతూ ఓటర్లను కలుసుకుని మద్దతు తెలపాలని కోరారు. సీతాఫల్ మండి డివిజన్ చిలకలగూడ, బడీ మసీదు ఏరియా, చోటి మసీద్, ఎరుకల బస్తీ, లైఫ్ స్ప్రింగ్ ఆసుపత్రి, కింది బస్తీ, భవానీనగర్, అన్నానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు. ప్రజలు పద్మారావుగౌడ్‌కు ఘన స్వాగతం పలికి నినాదాలు చేశారు. కళాకారుల తెలంగాణ ఆటపాటలతో ప్రజలను హోరెత్తించారు.

ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. ప్రజా సమస్యలు పై నిరంతరం శ్రమించిన తమకే ప్రజల నుంచి ఓట్లు అడిగే నైతిక హక్కు ఉందన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ నియోజకవర్గ కార్పొరేటర్లు శైలజ, సునీత, ప్రసన్నలక్ష్మి, బీఆర్ఎస్ యువ నేతలు కిశోర్‌కుమార్‌గౌడ్, కిరణ్‌కుమార్‌గౌడ్, రామేశ్వర్‌గౌడ్, త్రినేత్రగౌడ్, నాయకులు మల్లూరి అనిల్‌కుమార్, చంద్రశేఖర్, నవీన్‌గౌడ్, నవీన్‌చారి, సుంకురాంచందర్, జలంధర్‌రెడ్డి, గౌస్‌బాయి, నాగేందర్ ముదిరాజ్, మహేందర్ ముదిరాజ్, అఫ్జల్ బాయ్, శ్యామ్, సతీశ్ గౌడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



చిలకలగూడ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పద్మారావుగౌడ్

### బీఆర్ఎస్‌లో చేరికలు..

బీఆర్ఎస్ అభ్యర్థి తీగుల్ల పద్మారావుగౌడ్ సమక్షంలో చిలకలగూడలో శనివారం సాయంత్రం పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడు తూ బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను చూసి వివిధ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరేందుకు క్యూ కడుతున్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి పలువురు సీనియర్ నాయకులు శనివారం సాయంత్రం పార్టీలో చేరారు. వారిలో చిలకలగూడ ప్రాంతానికి చెందిన సీనియర్ నాయకుడు మల్లేశ్‌యాదవ్, కనకయ్య, నర్సింగ్ యాదవ్ తదితరులు ఉన్నారు.



విజయం మనదే అంటూ.. బెలూన్లను ఎగురవేస్తున్న పద్మారావుగౌడ్, నాయకులు

### నాడు వరద ముంపుతో విలవిల..

# నేడు ప్రశాంతంగా కాలనీలు

- బీఆర్ఎస్ పాలనలో నాలాల విస్తరణ, డ్రైన్ల నిర్మాణంతో సాఫీగా వెళ్తున్న మురుగు నీరు
- కాలనీల్లో తప్పిన వరద ముప్పు..
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు

సికింద్రాబాద్, నవంబర్ 4: వాన వచ్చిందంటే.. ఒకప్పుడు సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలు అతలాకుతలం అయ్యేవి.. కాలనీలు నీట మునిగి వరద ముంపులో ప్రజలు తల్లడిల్లేవారు. ఏండ్ల తరబడిగా ఇదే తంతు కొనసాగుతుండేది. పాలకులు మాత్రం తాత్కాలిక మరమ్మతులు చేపట్టేవారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో టేబుల్ డ్రైన్,స్టోంవాటర్ డ్రైన్లు నిర్మించి కాలనీల్లో వరద ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించింది.

### వానొస్తే భయం భయం..

నాడు వానొచ్చిందంటే చాలు.. సికింద్రాబాద్ నియోజకవర్గం అతలకుతలమయ్యేది... నాలా పారీవాహక ప్రజలు బయట కాలు మోపే పరిస్థితులు లేవు.. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సికింద్రాబాద్ నియోజకవర్గ రూపు రేఖలు మారిపోయాయి. నియోజవర్గ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ విశేషంగా కృషి చేశారు. పక్కాగా ప్రణాళికలు రచించి వర్షపు నీటిని మళ్లించేందుకు చర్యలు చేపట్టారు. అవసరం ఉన్నచోట డ్రైనేజీలు, సైడ్ డ్రైన్లు, పైప్‌లైన్ నిర్మాణాలు చేపట్టి వరద ముంపు నుంచి ప్రజలను కాపాడారు.



నామాలగుండు-మహ్మద్‌గౌడ నాలాలో సాఫీగా వెళ్తున్న మురుగు నీరు

### 2014కు ముందు

జూన్ 2014కు ముందు చిన్నపాటి వర్షాలకు సికింద్రాబాద్‌లోని వివిధ ప్రాంతాలు జలయమం అయ్యేవి. చిలకలగూడలోని భవానీనగర్ నుంచి అన్నానగర్, మహ్మద్‌గూడ, పుల్లయ్యబావి, మారుతి విధి,అంబర్‌నగర్, షాబాజ్‌గూడ, అంబర్‌నగర్ కట్టవైపు సాగే నాలాలు పొంగి ప్రవహించేవి. చంద్రబాబునగర్, లక్ష్మినగర్, సిరిపూరికాలనీ, లాలాపేట ప్రాంతాలు జల దిగ్బంధనంలో చిక్కుకునేవి.

### డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్ చొరవ..

వరద ముంపు పరిస్థితులపై డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్ దృష్టి పెట్టారు. నాలా పూడికతీత పనులకు ఏడాదికి రూ. 10లక్షలు కేటాయించారు. ప్రధాన నాలాల ఎత్తు పెంచి పునర్నిర్మించారు. వారాసిగూడ కౌసర్ మసిద్ నాలాను రూ. 7కోట్లతో, ఇందిరానగర్ నాలాను రూ. 4 కోట్లతో, బ్రహ్మణబస్తీ నాలాను రూ.4కోట్లతో విస్తరించారు. అన్ననగర్, ఫ్రైడే మార్కెట్, మహ్మద్‌గూడ, అంబర్‌నగర్, లాలాపేట కల్వర్టులను రూ.10 కోట్లతో పునర్నిర్మించారు. ఇంకా వర్షపు నీరు నిలిచే తొమ్మిది ప్రాంతాల్లో టేబుల్ డ్రైన్, స్టోంవాటర్ డ్రైన్లను నిర్మించారు. పెద్ద వానలు పడినా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకున్నారు. దాంతో వరద ముంపు ప్రాంతాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

### వరద నీరు సాఫీగా పోతున్నది..



వాన వస్తే అప్పటి రోజులు భయంకరంగా ఉండేవి. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారింది,బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కాచర్యలు చేపట్టింది. డిప్యూటీ స్పీకర్ పద్మరావుగౌడ్ ప్రత్యేక చొరువతో వరద నీటి సమస్యకు చెక్ పెట్టారు. ఇప్పుడు వరద నీరు ఇళ్లలోకి రావడం లేదు. వర్షం కురిసిన కూడా బయటకు వచ్చే పరిస్థితులు ఉన్నాయి. ఎక్కడ కూడా నీళ్లు నిలువడం లేదు.

– తూర్పాటి శివకుమార్, మమ్మద్‌గూడ

### నాడు కంటి మీద కునుకు కరవు..



నాలా పరీవాహక ప్రాంతాల్లో వర్షం కురిస్తే భయంతో జంకే వాళ్లం. వరద నీరు, నాలా నీటితో ఇబ్బందులు పడే వాళ్లం. ఇళ్లంతా మురుగు నీరే.. కంపు వాసన నిత్యావసర సరుకులతో పాటు ఇతర సామగ్రి వాన నీటితో తడిసి పడైపోతుండే. ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వ డ్రైన్లు నిర్మించి ఎక్కడికక్కడ నాలాలను విస్తరించడంతో మురుగు నీరు సాఫీగా వెళ్తన్నది. బీఆర్ఎస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– లక్ష్మి, అన్నానగర్, నామాలగుండు